అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 10 జనవరి 2023

ఆయిల్ ఫామ్ క్షేత్రం సందర్శన

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర గ్రామంలో రైతు ప్రవీణ్‌రెడ్డి ఆయిల్‌ఫామ్‌ను రైతులు, అధికారులు సోమవారం సందర్శించారు. ఆయిల్ ఫామ్ సాగు విధానం, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ రాంబాబు, మోపాల్ మండల ఏవో రవీందర్, హార్టికల్చర్ డీడీ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


ఆయిల్‌ఫాం సాగును సందర్శిస్తున్న రైతులు, అధికారులు

ఉరేసుకొని రైతు ఆత్మహత్య

- సాగునీటి కోసం బోర్లు వేసి అప్పుల పాలు

నవతెలంగాణ-లింగంపేట్

పంటపండించేందుకు సాగునీటి వసతి లేక బోర్లు వేయించగా.. అవి పడకపోవడంతో అప్పుల పాలై తీవ్ర మనస్థాపానికి గురై ఉరేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం బోనాల గ్రామంలో సోమవారం వెలుగుజూసింది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కప్ప సంగయ్య (45)కు గ్రామ సమీపంలో ఒక ఎకరా 20 గుంటల భూమి ఉంది. ఇందులో పంట సాగు చేసుకోవడానికి సాగునీరు లేకపోవడంతో గతేడాది అప్పులు చేసి మూడు బోర్లు వేశారు.



వివరాలు మెయిన్‌లో..

రవాణా రంగ కార్మికుల బతుకులు దుర్భరం

- వారి సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలి
- పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్
- కామారెడ్డి మీదుగా నిజామాబాద్‌కు చేరిన రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్/నిజామాబాద్‌సిటీ

రవాణ రంగం మీద ఆధారపడి లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, కానీ వీరి సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఏ ఒక్క పథకాన్ని తీసుకురాలేదని పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ అన్నారు. వీరికోసం సంక్షేమ బోర్డు తీసుకురావాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం నుంచి సంగారెడ్డి వరకు చేపట్టిన రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర సోమవారం సాయంత్రం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చేరింది. సిరిసిల్లారోడ్డు వద్ద యాత్రకు నాయకులు, కార్మికులు స్వాగతం పలికారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం నిజామా బాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్న యాత్రకు బోర్గాం వద్ద రవాణా రంగ కార్మికులు, సీఐటీయూ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బోర్గాం నుంచి వినాయక్‌నగర్ మీదుగా పులాంగ్ నుంచి కోర్టు చౌరస్తా, రైల్వేస్టేషన్ మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. బస్టాండ్ వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు దొరకని పరిస్థితుల్లో ఆటో, టాక్సీ, గూడ్స్, రవాణా, స్కూల్ బస్సులు వంటి వాటిలో పనిచేస్తూ స్వయం ఉపాధి పొందుతూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వాలు వీరి సమస్యలు పరిష్కరించడం లేదని, వీరికి ఎటువంటి పథకాలు అమలు చేయకపోగా, వివిధ రకాలుగా వేధింపులకు గురి చేస్తూ ఈ రంగంలో బతకడం కష్టంగా మారుస్తు న్నారని అన్నారు. రవాణా రంగ కార్మికుల పరిస్థితిలో మార్పులు చేయాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పెంచిన ఫైన్లను తగ్గించాలని అనువైన స్థలాలు అడ్డలుగా ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు పరిష్కారం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


నిజామాబాద్‌లో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య, పి. శ్రీకాంత్

రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు లేని ఫలితంగా వీరు చిన్న ప్రమాదం జరిగి గాయపడినా, అంగవైకల్యానికి గురై అనారోగ్యం పాలైనా ఎటువంటి సహాయం అందట్లేదని అన్నారు. ఆ సమయంలో పని, ఆదాయం ఉండదని, ఖర్చులు అధికంగా ఉంటాయని తెలిపారు. 'కేరళ రాష్ట్రంలో ఏర్పడ్డ వామపక్ష ప్రభుత్వం ఆ రాష్ట్రంలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి పాటుపడుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆ తరహా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అదే విధంగా కేరళాలో రవాణా కార్మికుల కోసం తీసుకొచ్చిన సవారి యాప్‌ను ఇక్కడా ప్రభుత్వమే తీసుకొచ్చి నిర్వహించి కార్మికులను ఆదుకోవాలి. భారత రాజ్యాంగం ప్రకారం రవాణా అనేది రాష్ట్రాలు పరిధిలో ఉన్నది. కానీ కేంద్ర ప్రభుత్వం ఎంవీఐ యాక్ట్ 2019 ముందుకు తీసుకువచ్చి మొత్తం రవాణా రంగాన్ని తన పరిధిలోకి తీసుకుంటున్నది. కార్పొరేట్ చేతుల్లో రవాణా రంగాన్ని పెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంది. పెనాల్టీలను విపరీతంగా పెంచడం ద్వారా ప్రమాదాలు తగ్గిస్తామని చెప్పడం మరో బూటకం. ప్రజల్లో అవగాహన కల్పించాల్సింది పోయి జరిమానాలు కనీసం 500 నుండి లక్ష రూపాయల ఫైన్‌తో పాటు మూడు సంవత్సర వరకు జైలు శిక్షలు విధిస్తున్నారు. మోటర్ వాహన చట్టం 2019 సవరించాలని' డిమాండ్ చేశారు. యాత్రలో యూనియన్ రాష్ట్ర నాయకులు రమేశ్, సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజనర్సు , టాటా ఏసీ ఫోర్ వీలర్ యూనియన్ అధ్యక్షులు పాషా, రాజు, నర్సింలు, సెక్రెటరీ నర్సింహులు, ట్రాలీ ఆటో నాయకులు గోపాల్, నాగరాజు, యూసుఫ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు, జిల్లా కోశాధికారి స్వర్ణ, నాయకులు మల్యాల గోవర్ధన్, కటారి రాములు, ఈవీఎల్ నారాయణ, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో స్వాగతం పలుకుతున్న కార్మికులు, నాయకులు

బియ్యం ఎప్పుడిస్తరో..?

- ఇంకా తెరుచుకోని రేషన్‌దుకాణాలు
- పండుగకు పస్తులే..!

నవతెలంగాణ-జుక్కల్


(ఫైల్‌ఫొటో)

రేషన్ బియ్యం కోసం లబ్దిదారులు ఎదురుచూస్తున్నారు. జనవరి నెలలో పది రోజులు పూర్తయినా ఇంకా రేషన్ దుకాణాలు తెరవకపోవడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో హమాలీ కార్మికుల సమ్మెతో రేషన్ బియ్యం సరఫరా నిలిచి.. చివర్లో పంపిణీ చేసినప్పటికీ ఆ సమాచారం లేక పలువురు బియ్యం తీసుకోలేకపోయారు. ఈ నెలలో తీసుకుందామని భావించగా.. ఇంకా దుకాణాలు తెరకపోవడంతో ఎదురుచూస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో 578 రేషన్ దుకాణాలు ఉండగా.. జుక్కల్ మండలంలో 24 ఉన్నాయి. బియ్యం పంపిణీ ప్రతి నెల ఐదవ తేదీనా ప్రారంభించి 15వ తేదీ వరకు పంపిణీ చేస్తుంటారు. ఇలా సజావుగా కొనసాగుతున్న క్రమంలో జననరి నెలలో పదిరోజులు గడుస్తున్న బియ్యం ఊసే లేదు. రాష్ట్ర వాటా దుకాణాలకు రాగా, కేంద్రం వాట బియ్యంపై స్పష్టత లేకపోవడంతో బియ్యం పంపిణీ నిలిపివేసినట్టు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి స్పష్టత తీసుకొచ్చి బియ్యం పంపినీ ప్రారంభించాలని లబ్దిదారులు కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు సోమవారం ఎల్లారెడ్డి డివిజనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి డివిజన్ సబ్ స్టేషన్ లలో పది రోజుల పని గూర్చి పలుమార్లు ఉన్నత అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని తెలిపారు. గాంధారి సెక్షన్‌లోని జువ్వడి సబ్‌స్టేషన్‌లో పదకొండు రోజులు విధులు నిర్వహించిన కానీ అదనపు డ్యూటీ చేయటం లేదని, వేతనంలో కోత విధిస్తున్న ఇట్టి సమస్యలను పలుమర్లు విన్నవించినా ఉన్నత అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఉన్నతా ధికారులు హామీ ఇవ్వడంతో ఉద్యోగులు ధర్నా విమరించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, సెక్రెటరీ హాఫీజోద్దీన్ ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కువైట్ వీసా పేరిట మోసం

ఆర్‌కే ట్రావెల్స్ ఎదుట గల్ఫ్ కార్మికుల ధర్నా



ధర్నా చేపట్టి బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కువైట్ వీసా ఇప్పిస్తానని మోసం చేశారని బాధితులు వాపోయారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్‌కే ట్రావెల్స్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. షేక్ బషీర్ అనే వ్యక్తి ఒక్కక్కరి వద్ద వీసా ఇప్పిస్తానని రూ.20 వేల నుంచి 50 వేల వరకు వసూలు ఉడాయించాడని గల్ఫ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బైటాయించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కచ్చకాయల గణేశ్ సిబ్బందితో అక్కడికి చేరుకొని గల్ఫ్ కార్మికులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

ప్రభుత్వం తరుపున ఆదుకుంటాం

- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి తహసీల్దార్ పరామర్శ


రైతుకు నివాళి అర్పించి కుటుంబాన్ని పరామర్శించిన తహసీల్దార్

నవతెలంగాణ-సదాశివనగర్

మాస్టర్‌ప్లాన్‌తో తన భూమి పోతోందని మనస్థా పానికి గురై ఆత్మహత్య చేసుకున్న పయ్యావుల రాములు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటా మని తహసీల్దార్ వెంకట్ రావు తెలిపారు. సోమవారం బాధిత కుటుంబాన్ని టీఆర్ఎస్ నాయకులు నర్సింలుతో కలిసి పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటా మని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకులు నర్సింలు మాట్లాడుతూ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు కుటుంబీకుల వివరాలు సేకరించినట్టు తెలిపారు. ఎమ్మెల్యే అండగా ఉంటానని హామీ ఇచ్చారని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

శాస్త్రీయ విద్యావిధానమే అవసరం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

శాస్త్రీయ విద్యా విధానమే విద్యార్థులకు అవసరం అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులకు జ్ఞానాన్ని నేర్పిస్తున్న కోటగిరి ఉన్నత పాఠశాలలో మల్లికార్జున్ అనే ఉపాధ్యాయునిపై దాడి చేసి దేవాలయానికి తీసుకెళ్లి అవమానించిన ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా యూనివర్సిటీ, కళాశాల, పాఠశాల పాఠ్యాంశాలలో జ్యోతిష్యాన్ని ప్రవేశ పెట్టే కుట్రలో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని అన్నారు.ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు, తాగు నీళ్ళు, మరుగుదొడ్ల సౌకర్యం, శిథిలావస్థలోని పాఠశాల భవనాలను కూల్చి కొత్త పాఠశాల భవనాలను ఏర్పాటు చేసే సమస్యలు ఎందుకు పరిష్కారం చేయడం లేదో ప్రభుత్వంపై, అధికారులపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఆర్‌ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులకు లేదా అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

జీవనాధారం కోల్పోతాం

- మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలి
- కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్‌లకు రైతుల వినతి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

'మాస్టర్‌ప్లాన్‌తో మా జీవనాధారమైన భూములు కోల్పోతున్నాం. మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేయాలని' రైతులు కోరారు. రైతు ఐక్య కార్యచరణ కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కామారెడ్డి మాస్టర్ ప్లాన్ తో తమ జీవన ధారమైన భూములను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ పై జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ ఇచ్చిన వివరణలు నమ్మశక్యంగా లేవని అన్నారు. మాస్టర్ ప్లాన్ అభ్యంతరాలను ఈ నెల 11 వరకు గడవు ఉండడంతో కౌన్సిల్ తీర్మానంలో సంతకాలు చేసే ఆమోదం తెలిపిన 49 మంది మున్సిపల్ కౌన్సిలర్లకు ముసాయిదాను రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ నిట్టు జాహ్నవి అందుబాటులో లేకపోవడంతో ఆమె తండ్రి, టీఆర్ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్ రావుకు వినతిపత్రం అందజేశారు. మాస్టర్‌ప్లాన్‌తో కామారెడ్డి పరిధిలో రైతుల నష్టపోతున్నారని, గత నెల రోజుల నుంచి ఆందోళనలు చేపడుతున్నట్టు తెలిపారు. 12వ తేదీన పురపాలక సంఘం అత్యవసర సమావేశం పెట్టుకొని మాస్టర్ ప్లాన్ రద్దు చేసే విధంగా తీర్మానం చేయాలని కోరారు. జీవన ఉపాధిగా ఉన్న భూమిని కాపాడాలని రైతులు కోరారు.


వినతిపత్రం అందజేస్తున రైతులు

ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం లోని మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక సోమవారం నిర్వహించినట్టు హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి 68 మంది పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ కనబరి చిన 22 మంది క్రీడాకారులను హాకీ శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. ఈ శిబిరం తూంపల్లిలో 10 నుండి 20 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఎంపికైనవారు 21, 22, 23తేదీల్లో నాట్కో పబ్లిక్ స్కూల్, రంగాపూర్ విలేజ్, నందిగామ మండలం, రంగారెడ్డి జిల్లాలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపిక ప్రక్రియను జిల్లా కోశాధికారి పింజా సురేందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి చిన్నయ్య, ఈసీ మెంబర్ సడక్ నాగేష్, సంతోష్ ఠాకుర్లు నిర్వహించారు.



ఎంపికైన క్రీడాకారులు

నూతన విద్యావిధానంతో విద్య కాషాయీకరణ



మాట్లాడుతున్న రవి

- ఉపాధ్యాయునిపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యను కాషాయీకరించేందుకు కేంద్రం నూతన విద్యా విధానం తీసుకొచ్చిందని దాన్ని వెనక్కు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి డిమాండ్ చేశారు. శాస్త్రీయ విద్యను బోధించే స్థానంలో జ్యోతిష్య శాస్త్రం, మూఢత్వం పెంచిపోషించేలా పూర్తిగా మార్చివేస్తుందని దుయ్యబట్టారు. ఆర్మూర్ డివిజన్ కమిటీ సమావేశం స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై ఆధారపడి రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3000 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నా ఇప్పటి వరకు వాటిని విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు గురుకులాలకు సొంత భవనాలు లేవని, సొంత భవనాలు కేటాయించాలని, హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని సంక్షేమ హాస్టల్లో వైద్య సౌకర్యం, స్కావెంజర్స్, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు.

ఎస్సై కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని నేడు ఎస్ఎఫ్ఐ చలో ప్రగతి భవన్‌లి ముట్టడికి పిలుపునిస్తే అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి ఎస్ఎఫ్ఐ నాయకులని అక్రమ అరెస్టులు చేయడానికి ఖండిస్తూ అరెస్ట్ అయిన నాయకులని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ బోధన్ డివిజన్ కోటగిరిలో ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో తెలుగు టీచర్ మల్లికార్జున్‌ను కొంతమంది దుండగులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. మల్లికార్జున్‌కు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందని, దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని లేకుంటే పెద్దఎత్తున ఉద్యోమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సిద్ధాల నాగరాజు, జోహార్ సింగ్, డివిజన్ సభ్యులు అరవింద్, హనుమంత్, అభిరామ్, సిరాజ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యుల నియామకం

నవతెలంగాణ-భిక్కనూర్




మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి నూతనంగా ఇద్దరూ ప్రభుత్వ వైద్యులు నియమితులయ్యారు. నూతన వైద్యులుగా డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ హేలీమా లను వైద్య ఆరోగ్యశాఖ నియమించింది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసిన డాక్టర్ సాయి సింధు మెదక్ జిల్లా చిన్న శంకరంపేట ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీపై వెళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు నూతన వైద్యులను నియమించారు. ఈ మేరకు సోమవారం నూతన వైద్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య భిక్కనూరుగా తీర్చిదిద్దేందుకు తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది నూతన వైద్యులను సన్మానించారు.

ప్రత్యేకాధికారులు పరిశీలన చేపట్టాలి

మండల ప్రత్యేకాధికారులకు కలెక్టర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, మన ఊరు - మన బడి, హరితహారం, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలన జరిపేందుకు వీలుగా మండల ప్రత్యేక అధికారులు మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష చేపట్టారు. మన ఊరు - మన బడి పనుల ప్రగతిని సమీక్షించాలని, పూర్తయిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎఫ్.టీ.ఓలు జెనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఎవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణ సక్రమంగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. మొక్కల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే పంచాయతీ కార్యదర్శులను ఉపేక్షించబోమని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. కాగా, వార్షిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా పదవ తరగతి, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు సంక్రాతి పండుగ తరువాత ప్రత్యేక పునశ్చరణ తరగతుల నిర్వహణ, ప్రేరణ కార్యక్రమాల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని డీ ఐ ఈ ఓ రఘురాజ్, డీ ఈ ఓ దుర్గాప్రసాద్ లను ఆదేశించారు.

ప్రజావాణికి 73 ఫిర్యాదులు.. తక్షణమే పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 73 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఐ సైదాను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ధర్పల్లి

ఇటీవల ధర్పల్లి సిఐగా బాధ్యతలు స్వీకరించిన సైదా ను మండలంలోని సితాయిపేట సొసైటీ డైరెక్టర్, మాజీ సర్పంచ్ భూమేష్ లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు పోశన్న, చంద్రకాంత్, రంజిత్ తదితరులున్నారు.

సీనియర్ జర్నలిస్టు జావిద్ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు జావీద్ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన జావీద్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జావీద్ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్సీ కవిత కుటుంబ సభ్యులకు జావీద్‌కు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌ను రద్దుచేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కామారెడ్డి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలని, కామారెడ్డి రైతుల పోరాటంలో సీపీఐ(యం-యల్) న్యూడెమోక్రసీ నిరంతరం పాల్గొంటుందని సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ండు పంటలు పండే వ్యవసాయ సాగు భూములను ఇండస్ట్రియల్ జోన్ గా, రిక్రియేషన్ జోన్లుగా మాస్టర్ ప్లాన్లు చూపి 8 గ్రామాల రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. 2700 ఎకరాల్లో 1195 ఎకరాలు ఇండస్ట్రియల్ జోన్ కింద మార్చడం దారుణమని, దీంతో సదాశివ నగర్ మండలం ఆడ్లూరు ఎల్లారెడ్డి గ్రామస్తులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రామేశ్వర్‌పల్లి గ్రామాన్ని రిక్రియేషన్ జోన్ గా మార్చారని ఈ గ్రామస్తులు హైకోర్టులో పిటిషన్ కూడా వేశారని ఈ గ్రామంలోని 120 మంది రైతులకు చెందిన 300 ఎకరాల భూములను రిక్రియేషన్ జోన్‌గా మార్చారని, టేక్రియల్, లింగాపూర్ ఇల్చీపూర్ గ్రామాలను గ్రీన్ ల్యాండ్ గా మాస్టర్ ప్లాన్లు చూపించారని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి పంపించిన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను మార్చి డిటిపిసి, న్యూఢిల్లీలోని ప్రైవేటు డీడీఎఫ్ కన్సల్టెన్సీ సంస్థ డ్రాఫ్ట్‌ను పూర్తిగా మార్చి తప్పిదం చేసిందని కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మీడియా సమావేశంలో పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని, కౌన్సిల్లో ఆమోదించిన డ్రాఫ్ట్ ను ఎన్నిసార్లు మారుస్తారని ప్రశ్నించారు. పాలకులు చేసిన తప్పిదానికి అధికారులను బలి చేయడం సరికాదని, పైగా అధికార పార్టీకి చెందిన తాడ్వాయి రోడ్డులోని శ్రీవారి వెంచర్‌కు లబ్ధి జరిగేందుకు వంద ఫీట్ల రోడ్డును దానికి లింకు కలుపుతూ అనేక కుట్రలు కుతంత్రాలు పన్ని మాస్టర్ ప్లాన్ ను మారుస్తున్నారని, సాగుభూములను కాకుండా శ్రీవారి వెంచర్ పరిధిలోని గల వందల ఎకరాల సర్కార్ భూముల్లో ఇండస్ట్రియల్ రిక్రియేషన్ జోన్లుగా ఎందుకు చూపలేక పోయారని ప్రశ్నించారు. అవసరంలేని చోట వంద ఫీట్ల రోడ్డు ప్రతిపాదనలు పంపి అవసరం ఉన్న చోట రోడ్డును కుదించారని, మరికొన్నిచోట్ల మొత్తాన్ని తీసేసారని అన్నారు. ఇది పూర్తిగా కుట్రల పూరిత మాస్టర్ ప్లాన్, దీన్ని వెంటనే రద్దు చేయాలని కామారెడ్డి రైతుల పోరాటంలో న్యాయం జరిగేంత వరకు కూడా పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో ఏఐకెఎంఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, సీపీఐ (యం-యల్) న్యూ డెమోక్రసీ నాయకులు నీలం సాయిబాబా, శివకుమార్, జెల్లా మురళి, రాజు, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

పెన్షనర్స్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, రిటైర్డ్ ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ప్రచురించిన 2023 డైరీ ని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల కోసం సంఘం చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి. చంద్రశేఖర్ , చిత్రా మిశ్రా, సీఈవో ,ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరరావు, సంఘం జిల్లా అధ్యక్షులు కే .రామ్మోహన్రావు, కార్యదర్శి మదన్మోహన్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు హనుమాన్లు, అందే సాయిలు బోధన్ కార్యదర్శి అద్దంకి ఉషాన్ , ఆర్మూర్ కార్యదర్శి శంకర్ జిల్లా నాయకులు ప్రసాద్‌రావు, భోజారావు, బాబాగౌడ్, రాజేందర్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో మెరుగైన విద్య అవసరం


విద్యార్థులను అభినందిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి

నవతెలంగాణ-సిరికొండ

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలంటే మెరుగైన విద్య అవసరమని ఉన్నత విద్యా మండలి చెర్మెన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, భారత ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇంధన సంరక్షణ పైన నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పి.సోని,యం. రిషిక్ గౌడ్‌కు ప్రత్యేక జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందజేయడానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య,డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బాలయ్య, ఉపాధ్యాయులు సతీష్,ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-నందిపేట్

బలహీన వర్గాలు, రైతుల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం నాలు గున్నర గంటలకే నందిపేట్ చేరుకొని పలు కులాల ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. నందిపేట్ పట్టణంలో పద్మశాలి, గౌడ, కురుమ, మున్నూరు కాపు సామాజిక వర్గాల వారి కోసం చేపట్టిన కమ్యూనిటీ ఫంక్షన్ హాళ్ళ, ముస్లిం మైనారిటీలకు షాది ఖానా నిర్మాణం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. రెండు ఎకరాల భూమిలో 50 లక్షల రూపాయిల వ్యయంతో పద్మశాలి సంఘానికి, మూడెకరాల భూమిలో రూ. 50 లక్షలతో కురుమ సంఘానికి, పదెకరాల భూమిలో రూ. 50 లక్షలతో గౌడ సామాజిక వర్గానికి ఫంక్షన్ హాళ్ల నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. వీటి పనులు తుది దశకు చేరుకున్నాయని, ఇంకేమైనా నిధులు అవసరమైతే సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చి మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముగ్గుపోస్తున్న ఎమ్మెల్యే

నాగారం రోడ్డు మార్గాన్ని సర్వే చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మాస్టర్ ప్లాన్‌లోని వినాయకనగర్, గాయత్రీ నగర్ నుండి రేడియో స్టేషన్ మీదుగా నాగారం వరకు ప్రతిపాదించిన 100 ఫీట్స్ రోడ్డును సర్వే చేయాలని మాస్టర్ ప్లాన్ బాధితుల కమిటీ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ నారాయణ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ప్రతిపాదిత రోడ్డు ఏ సర్వే నెంబర్లు, ప్లాట్స్ గుండా పోతుందో అర్థం కాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఇల్లు కట్టుకోవటానికి ముందుకొచ్చిన వారికి సర్వే చేయడం మూలంగా ముందుకెళ్లేందుకు అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. 100 ఫీట్ల రోడ్డును సర్వే చేసి హద్దులు పాతాలని కన్వీనర్ కే రామ్మోహన్రావు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విజయకుమార్, రాములు, రాజు, రామ్ చందర్, పుండరీ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవితా పోటీల్లో విజేతలుగా విజయ్ విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రస్థాయి కవితా పోటీల్లో విజయ్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విద్యార్థి దశ నుండి సాహిత్య సృజనను కల్పించి కవితాశక్తిని వెలికితీయాలనే ఉద్దేశంతో విజ్ఞాన వికాస్ మండలి ఆధ్వర్యంలో బాలల కవితల పోటీలు డిసెంబరు నెలలో నిర్వహించారు. ఈపోటీల్లో విజయ్ పాఠశాల నుండి 14మంది విద్యార్థులు పాల్గొన్నారని విజయ్ హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ ప్రభాదేవి సోమవారం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా 'అక్షరమే ఊపిరి' అనే అంశంపై 9వ తరగతి చదివే జే. అభిలాష్ శర్మ, 7వ తరగతి చదివే సి. హెచ్, స్రేర్ధ కవితలు రాసి బహుమతులు గెలుచుకున్నారు. ఇరు రాష్ట్రాల నుండి తొమ్మిది మంది విజేతలను ఎంపికచేయగా అందులో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. విజేతలకు త్వరలో హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని తెలిపారు. విద్యార్థులను పాఠశాల కార్యదర్శి డా. అమృతలత, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ పి.విజేత అభినందించి హర్షం వ్యక్తం చేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కార్యదర్శి

మల్లారంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు మల్లారం గ్రామంలో సోమవారం నిర్వహించారు. మల్లారం గ్రామం భారత్ యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ పాల్గొని మాట్లాడారు. మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్ది వారిలో అభ్యుదయ భావాలను పెంచేందుకు నిరంతరం కృషి చేసిన సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయు రాలని, చదువు అనేది అందరికీ సంబంధిం చిందని, ఇది అగ్ర వర్ణాలవారికే పరిమితం కాదని అన్నారు. అట్టడుగు వర్గాలు కూడా చదువు కోవాలనే ఉద్దేశంతో సావిత్రిబాయి పూలే చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను జగన్ చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ బానోత్ ప్రేమ్ నాయక్, జడ్పిటిసి గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచ్ నగేష్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మధుకర్ రావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు జమీర్ ఖాన్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గాజుల శంకర్, పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.


సావిత్రిబాయి జయంతిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

'ఎమ్మెల్యేను దూషించే స్థాయి నీకు లేదు'

నవతెలంగాణ-సిరికొండ

రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చెర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను దూషించే స్థాయి భారతీయ జుటా పార్టీ నాయకుడు దినేష్ కులచారికి లేదని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం చీమన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పై విమర్శలు తగవని, ఆయనను దూషించే స్థాయి నీకు లేదని, గ్రామాల్లో ప్రజలు తరిమి కొడతారని అన్నారు. దినేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ పద్మాశివారెడ్డి, పంది మడుగు సర్పంచ్ గంగా నర్సయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు జితేంద్ర సింగ్, మండల యూత్ అధ్యక్షులు చిగురు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, పార్టీ నాయకులు శ్రీధర్, నాగరాజు, రాజు, గోవింద్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామశాఖ అధ్యక్షులు ఋక రాజు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామంలో సోమవారం హైమాస్ట్ లైట్లను జడ్పిటిసి మాలావత్ మాన్సింగ్ నాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైమాస్ట్ లైట్లు మంజూరు చేసినందుకు రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జెడ్పిటిసి, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దానెం లక్ష్మి తిరుపతి ,ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తీనేటి నర్సారెడ్డి, స్థానిక ఎంపీటీసీ గోవర్ధన్,జాగృతి జిల్లా కన్వీనర్ సాయి చరణ్, చిన్నారెడ్డి, దుమాల గంగారెడ్డి, టీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఊరెళితే జాగ్రత్త

పోలీసులకు సమాచారమివ్వండి

సీపీ నాగరాజు వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సంక్రాంతి పండగ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా ప్రజలు సెలవులకు వెళ్లేవారు తూచ తప్పకుండా నియమ నిబంధనలను పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు సోమవారం తెలిపారు. రద్దీ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, హర్ ఏక్ మాల్ వస్తువులను విక్రయించే వారిపై నిఘా పెట్టాలన్నారు. రాత్రయితే అనుమానంగా సంచరించే వారిని పలుకరించండని తెలిపారు. శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు గమనించి రాత్రి వేళ చోరీలకు పాల్పడటం జరుగుతుంది. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. మహిళలు, వృద్ధులు అపరిచితులు వస్తే నమ్మవద్దన్నారు. ఖరీదైన వస్తువులు బ్యాంక్ లాకర్లో పెట్టుకోవడం మంచిదని సూచించారు. కాలనీల వారిగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి అని తెలిపారు. తాళం వేసి ఊరు వెళ్లే ముందు పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని అన్నారు.

సెర్ప్ పేస్కేల్ జీవో విడుదల చేయాలని మంత్రికి వినతి

నవతెలంగాణకమ్మర్‌పల్లి

సెర్ప్ పే స్కేల్ జీవో వెంటనేవిడుదల చేయాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు క్యాంపు కార్యాలయంలో సెర్ప్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర క్యాలెండర్లను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమ్మర్ పల్లి ఏపీఎం, సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర నాయకులు సెర్ప్ ఉద్యోగుల పే స్కేల్ జీవో వెంటనే విడుదల చేయాలని మంత్రికి విన్నవించారు. ముఖ్య మంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పే స్కేల్ ఫైల్ ప్రాసెస్ మొత్తం పూర్తి చేసి జీవో విడుదలకు ఏర్పాట్లు పూర్తి చేసినందుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలింగ్ నిర్వహించడం, బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ ఇంక్రిమెంట్స్ ఇవ్వడం సహ పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి సమర్పించారు. స్పందించిన మంత్రి సెర్ప్ ఉద్యోగుల పేస్కేలు జీఓకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులతో సంప్రదింపులు నిర్వహిస్తామని వెల్లడించినట్లు గంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు ఎపూరి నర్సయ్య, సుదర్శన్, జానయ్య, సుభాష్, వెంకట్, రాష్ట్రం నలుమూలల నుంచి సెర్ప్ ఉద్యోగ సంఘాల జిల్లా నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

బీఆర్ఎస్ నాయకున్ని పరామర్శించిన జగన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి, జిల్లా యువ నాయకులు బాజిరెడ్డి జగన్మోహన్ మల్లారం గ్రామంలో గ్రామ రైతుబంధు కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాయడి సుదర్శన్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో సోమవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ ప్రేమ్ నాయక్ జెడ్పిటిసి గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు,గ్రామ సర్పంచ్ నగేష్, పార్టీ అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్ , మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు జమీర్ ఖాన్ , సీనియర్ నాయకులు బాలరాజ్, లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గాజుల శంకర్, సర్పంచులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన మండలాధికారులు


పనులను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని గుమ్మిర్యాల్ ప్రాథమిక పాఠశాలలో మనఊరు-మనబడిలో భాగంగా జరుగుతున్న పనులను తహసీల్దార్ జనార్ధన్, ఎంపీడీఓ రాజేశం, ఎంఈఓ ఆంధ్రయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మండల కాంప్లెక్స్ హెచ్ఎం. మునీరోద్దీన్, గుమ్మిర్యాల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం. ఆర్.భాస్కర్, ఉపాధ్యాయులు పబ్బ శంకర్, గౌతమి, సీఆర్పీ సాయిరాం, కారోబార్ మారుతి పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువులో గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్టు ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. సుమారు మృతుడి వయసు 45 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పేర్కొన్నారు. మృతున్ని గుర్తుపట్టిన వారు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని తెలిపారు.

అవినీతిపై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించాలి : బీజేపీ

ముున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

కలెక్టర్, ఎమ్మెల్యే సమన్వయంతో మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సిట్టింగ్ జిల్లా జడ్జీతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ముందు బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లా ప్రధాన కార్యదర్శి, బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నరసింహారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు మాట్లాడుతూ... మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ధర్నాలు చేసిన, అధికారులకు విన్నవించుకున్నా స్పందించకపోవడం అధికారులు, బీఆర్ఎస్ ప్రభుత్వ గుప్పిట్లో ఉన్నారనడానికి నిదర్శనమని అన్నారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు, నాన్ లేఔట్, కోర్టు కేసులోని స్థలాల్లో ఏ అధికారంతో ఇంటి నెంబర్లు కేటాయించారని వాటిని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ఇంటి నెంబర్లు కేటాయించినటువంట మున్సిపాలిటీ మేనేజర్ మనోహర్‌కు కమిషనర్‌గా ఇంచార్జ్ ఇవ్వడం దొంగకే తాళం చెవి ఇచ్చినట్లుగా ఉందని అన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్డాగా మార్చిన కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని, ఎమ్మెల్యే రాజీనామా చేసి తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఎంక్వైరీ చేయించుకోవాల్సిన అవసరం ఉందని, డిమాండ్ చేశారు. నీటిపారుదలశాఖ డీఈ రమణారావు అధికారులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని అన్నారు.

కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ద్యాగ ఉదయ్, పల్లె శ్రీనివాస్, బిజెపి ఆర్మూర్ పట్టణ ఉపాధ్యక్షులు ధోండి ప్రకాష్, కార్యదర్శి ఖాందేశ్ ప్రశాంత్, బీజేవైఎం పట్టణ మండల అధ్యక్షులు కలిగోట ప్రశాంత్, నరేష్ చారి, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శులు పసుపుల సాయికుమార్, ఉదయ్ గౌడ్, ఉపాధ్యక్షులు పెరంబదూరు వాసు, గిరిజన మోర్చ ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు కిలోత్ పీర్ సింగ్ నాయక్, దళిత మోర్చ పట్టణ అధ్యక్షులు పులి యుగంధర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మిర్యాల్‌కర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో అరుణోదయ సుబ్బారావు సోమవారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అధ్యక్షత వహించగా. ముఖ్య వ్యక్తులుగా రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, ఉపాధ్యక్షురాలు కల్పన, పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక సమైక్య సహాయ కార్యదర్శి కామ్రేడ్ సుబ్బారావు అకాల మరణంతీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్య విజయ, జయ, రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మల్లారి గంగాధర్, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, యువజన సంఘం నాయకులు విజ్ఞేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ-లింగంపేట్

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఐలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గజ్జుసంగవ్వ (44) అనే వివాహిత రెండు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. అయితే ఆస్పత్రిలో చూయించుకున్నా నయం కాకపోవడంతో మనస్థాపం చెందిన ఆమె.. ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. శవానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. భర్త ఆనంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవన ఎరువులతో విత్తన శుద్ధి



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో చిన్నబీర లింగరావు రైతు పొలంలో జొన్న విత్తనానికి ట్రైకోడేర్మా విరిడి అనే జీవన ఎరువులతో విత్తన శుద్ధి చేయించినట్టు ఏఈఓ హారిక తెలిపారు. ఒక కేజీ విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడేర్మా విరిడి పట్టించి విత్తుకోవాలని సూచించారు. ఎండుతెగులు ఉండే నేలల్లో 4 కేజీల ట్రైకోడేర్మా విరిడిని ఎకరానికి సరిపడా పశువుల ఎరువులతో కలిపి వారం రోజుల పాటు నీడలో ఉంచి తేమ ఉండేట్టు చూసుకొని వారం తరువాత నేలలో చల్లుకోవడం వల్ల ఎండు తెగులు రాకుండా చేసుకోవచ్చునని ఏఈఓ సూచించారు. కార్యక్రమంలో విఠల్‌రావు, సతీష్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వట్లే



ఆర్అండ్‌బీ అధికారిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి

- సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆగ్రహం
- సభను వాకౌట్ చేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు
- రసాభాసగా రామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-రామారెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభించే సమయంలో అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై వివక్ష చూపుతున్నారని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సభను వాకౌట్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సభలో కొందరు ఎంపీటీసీలకే చరవాణి ద్వారా సమాచారం అందించారని, కొందరి పట్ల వివక్ష చూపుతున్నారని, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రాజాగౌడ్, ఎంపీటీసీలు తుపాకుల రజిత రాజేందర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, కోఆప్షన్‌మెంబర్ గౌస్ సభను వాకౌట్ చేశారు. రామారెడ్డి సర్పంచ్ దండబోయిన సంజీవ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో పనులు చేపట్టినా.. స్థానిక సర్పంచుకు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండానే పనులు ప్రారంభించి, నాణ్యత లేకుండా పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇక నుంచి గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ సమాచారం లేకుండా పనులు నిర్వహిస్తే కేసు పెడతామని, ఎస్సీ హాస్టల్లో సమాచారం లేకుండా, నాణ్యత లేకుండా పనులు నిర్వహిఎంచాలని, గిద్ద గ్రామంలో స్థానిక సర్పంచుకు సమాచారం లేకుండా పనులు నిర్వహిస్తున్నారని, సంజీవ్‌తో పాటు గిద్ద సర్పంచ్ రామ్‌రెడ్డి సభను వాకౌట్ చేశారు. విద్యుత్ సమస్యపై, సిబ్బందిపై ఉప్పల్వాయి సర్పంచ్ గంగారాం పనులు చేయటం లేదని, 16 విద్యుత్ స్తంభాల కోసం నాలుగు సంవత్సరాల నుంచి విన్నవించినా, కార్యరూపం దాల్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతి వేలిముద్రలు రాక 22 కుటుంబాలకు రేషన్ బియ్యం అందటం లేదని, వారికి న్యాయం జరిగేలా చూడాలని గంగారాం కోరారు. మోషన్‌పూర్‌లో మిషన్ కాకతీయ కింద నాణ్యతలేకుండా పనులు నిర్వహించి బిల్లులు తీసుకున్నారని ఎంపీటీసీ ఉమాదేవి లేవనెత్తారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీరు అందిస్తున్నామని ప్రభుత్వం చెప్తుంటే, రామారెడ్డి మండలంలో తాగునీటి కోసం బోర్లు తవ్వించడం ఏంటని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను మిషన్ భగీరథ అధికారులు అందించాలని జెడ్పీటీసీ కోరారు. గంగమ్మ వాగు బ్రిడ్జిపై గతంలో ఎన్నో నిరసనలు తెలిపామని, నూతన బ్రిడ్జి మంజూరైందని కాలయాపన చేయడం, పనులు చేపట్టకపోవడంపై మండిపడ్డారు. గొల్లపల్లిలో పెళ్లి పందిరి కోసం కట్టెలకు అనుమతించి, తీసుకొచ్చిన తర్వాత, బీట్ ఆఫీసర్ శ్రీధర్ రూ.50వేలు జరిమానా విధిస్తామని భయభ్రాంతులకు గురిచేసి, ప్రజాప్రతినిధులు చెప్పినా వినకుండా రూ.10వేలు లంచం తీసుకోవడం ఏంటని మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎంపీపీ దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతోనే బ్రిడ్జి పనులు జాప్యం జరుగుతుందని అన్నారు. డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. త్వరలో పనులు ప్రారంభించే ప్రయత్నం చేస్తామని అన్నారు. ధరణి సమస్యలతో జెడ్పీటీసీ భూమే ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, సామాన్య రైతు పరిస్థితి ఏంటని మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎంపీపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిద్ద గ్రామ పరిసరాల్లో రంగు రాళ్లు ఉన్నాయని రెవెన్యూ అధికారులు భూమి ఆనాడు స్వాధీనం చేసుకుంటే, ఓ ప్రజా ప్రతినిధి భూ కబ్జా చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్గం సాయిరెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎమ్మార్వో సాయిలు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రామ్‌రెడ్డి, ఎంపీఓ సవిత, ఎంఈఓ యోసఫ్, ఏవో హరీష్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన జీపీ భవనాల కోసం స్థలాలు సేకరించాలి

- బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్



మాట్లాడుతున్న ఆర్డీవో

నవతెలంగాణ-జుక్కల్

నూతనంగా మంజూరైన జీపీ భవనాల నిర్మాణాల కోసం అందుబాటులో ఉన్న స్థలాలను సేకరించాలని బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్ జుక్కల్ తహసీల్దార్ గణేష్‌ను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రూ.20 లక్షల వ్యయంతో ఉపాధిహామీలో భాగంగా మండలంలోని లాడేగాం, మథురాతాండా, మైబాపూర్, గుల్లాతాండా, బంగారుపల్లి, జీపీలలో బిల్డింగ్ నిర్మాణం చేయనున్నట్టు, స్థలం సేకరణ పూర్తయిందని తెలిపారు. అదేవిధంగా పోడుభూముల గురించి ధరణి పోర్టల్ ఉన్న వివరాలను తెలుసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం హంగర్గ జీపీ గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేష్, డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మీ, ఆర్ఐ రామ్‌పటేల్, సిబ్బంది నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు అపూర్వస్పందన



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించిందని ఏపీఎం శిరీష సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు 41 మంది నిరుద్యోగులు హాజరైనప్పటికీ 33 మంది ఇంటర్వ్యూకు హాజరుకావటంతో 17 మంది నిరుద్యోగులను ఎంపిక చేసి నలుగురిని మండలానికి, 13 మందిని ఇతర ప్రాంతాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈజీ ఎంఎం శ్రీధర్, అపోలో ఫార్మసీ రాజశేఖర్, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కోల్పోయిన బాధితులకు ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి చెందిన మరిపల్లీ కాశీరాం లారీ ప్రమాదంలో ఇల్లు ధ్వంసమవడంతో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సుభాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి తక్షణ సాయంగా ఆర్థికసాయం అందజేశారు. అక్కడి నుంచి సంబంధిత ఎమ్మార్వోకు మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విట్టల్‌రావు, నర్సింహారెడ్డి, శివాజీ, భూంరావ్, స్వామిరెడ్డి, అశ్వక్, గడ్డరాజు తదితరులు పాల్గొన్నారు.

గోదాం పనులు పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాం పనులను తాడ్వాయి సింగిల్ విండో చైర్మన్ కపిల్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. గోదాం నిర్మాణ పనులు నాణ్యతతో నిర్మించాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ధర్మారెడ్డి, పాలకవర్గ సభ్యులు రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న యువకులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలం కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో క్రికెట్, వాలీబాల్ పోటీలను సోమవారం ప్రారంభించారు. యూత్ డే సందర్భంగా కామారెడ్డి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ విజయ్‌కొండ తెలిపారు. ముందుగా వాలీబాల్ పోటీలు నిర్వహించగా ప్రథమస్థానంలో చిన్నతక్కడ్‌పల్లి యువకులు గెలిచారు. ద్వితీయస్థానంలో పెద్దకొడప్‌గల్ గెలిచినట్టు ఎస్ఐ విజయ్ కొండ తెలిపారు. కార్యక్రమంలో సీఐ క్రిష్ణ, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల సర్వే

నవతెలంగాణ-విలేకరుల బృందం

పలు గ్రామాల్లో బడి బయట పిల్లల కోసం ఉపాధ్యాయులు, అధికారులు సోమవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పిల్లలను గుర్తించి పేర్లు నమోదు చేసుకున్నారు. పిల్లలను పనులను పంపవద్దని.. బడిలో చేర్పించాలని సూచించారు.

లింగంపేట్ : మండలంలోని సజ్జనపల్లి, ఎక్కపల్లి గ్రామాలలో బడి బయట పిల్లల సర్వేను నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్‌పల్లి ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రాజు ఆధ్వర్యంలో సజన్‌పల్లి, ఎక్కపల్లి గ్రామాలలో ఒ.ఎస్.సి (బడి బయట పిల్లలు) సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దామోదర్, ఉపాధ్యాయులు పద్మ, సంగమేశ్వర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రాజు బడికి రాని పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రాజు, ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు పద్మ, సంగమేశ్వర్ పాల్గొన్నారు.



భిక్కనూర్ : జంగంపల్లిలో సర్వే



వర్నిలో..

భిక్కనూర్ : మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఎంఈఓ ఎల్లయ్య బడి బయట పిల్లలను గుర్తించి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంగంపల్లి గ్రామంలో చదువుకునే వయస్సులో బడిబయట పిల్లలను గుర్తించి పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందజేసి పాఠశాలలో చేర్పించినట్టు తెలిపారు. చదువుకునే వయసులో చిన్నారులు బయట పనిచేసినా, చదువుకోకుండా ఇంట్లోనే కూర్చున్నా పాఠశాలలో చేర్పించనున్నట్టు తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింబాద్రి, సీఆర్పీ సత్యనారాయణ, సంపత్ తదితరులున్నారు.

వర్ని : సమగ్ర శిక్షణ అభియాన్ అధికారుల ఆదేశాల అనుసారం ప్రభుత్వ పాఠశాల సీఆర్పీ, ఓఎస్‌సీ బృందం గ్రామాల్లోని ఇటుక బట్టీలలో, హెూటల్లో పాచి పని చేసే పిల్లలను గుర్తించారు. బడికి వెళ్లకుండా ఉండే పిల్లల తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థుల పేర్లను నమోదు చేసుకుని విద్యార్థులను దగ్గరగా ఉన్న బడిలో చేర్పించడానికి ప్రభుత్వం ఆదేశిస్తుందని సీఆర్పీ సాయిలు తెలిపారు.

గుండెపోటుతో ఎన్ఎస్ఎఫ్ కార్మికుల మృతి



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికుడు గంగారాం(56) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కార్మిక సంఘం నాయకులు మృతుని కుటుంబానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మజ్దూర్ సభ యూనియన్ నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు రావాల్సిన ఏడు సంవత్సరాల బకాయి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందుతున్నారని అన్నారు. కావున ప్రభుత్వం కార్మికుల కుటుంబాలకు ఆదుకోవాలని, మృతి చెందిన కార్మికులకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. మృతుని అంత్యక్రియలలో కార్మిక సంఘాల నాయకులు రవిశంకర్‌గౌడ్, శ్రీనివాస్, బాలకృష్ణ, నాగేశ్వరరావు కార్మికులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గణేష్ తెలిపారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెట్టిన బైరి నరేష్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టుపెట్టిన గండి మాసానిపేట్ గ్రామానికి చెందిన అట్కారి బాబు అలియాస్ బబ్లును పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎమ్మార్వో ముందు ప్రవేశపెట్టినట్టు ఎల్లారెడ్డి ఎస్ఐ గణేష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ.. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా ఇతరుల మత విశ్వాసాలు నమ్మకాలు దెబ్బతినేలా పోస్టులు చేయడం, వాటికి మద్దతుగా పోస్టులు పెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మైనారిటీ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ వెంకట రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో పూర్తి సీట్లు, 6,7,8 తరగతులో పరిమిత సంఖ్యలో మిగిలి ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఒక్క తరగతిలో 40 సీట్లకు గాను 26 సీట్లు ముస్లిం మైనారిటీ విద్యార్థులకు, 2 సీట్లు క్రిస్టియన్ మైనారిటీలకు, సిక్కు, బౌద్ధులు, పరసీకులు, జైనులకు 2 సీట్లు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే నాన్ మైనారిటీ కోటలో 10 సీట్లకు గాను 5 సీట్లు బీసీ విద్యార్థులకు, 2 సీట్లు ఎస్సీలకు, 2సీట్లు ఎస్టీలకు, ఒక సీటు ఓసీ విద్యార్థులతో భర్తీ చేస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా పాఠశాల, కళాశాలకు వచ్చి ఈనెల 15వ తేదీ నుంచి 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2022-23 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్ట్‌ఇయర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

గ్రామాలాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాలాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని రూ.60లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సొసైటీ భవనానికి భూమి పూజచేశారు. అలాగే సంగమేశ్వర్ గ్రామంలోని దాత సహకరంతో నిర్మించిన గ్రంథాలయం భవనం, అంచనూరు గ్రామంలోని రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు, రూ.25 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ మాట్లాడుతూ.. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమానికి రైతుబంధు, రైతుబీమా, ఉచితంగా విద్యుత్తును అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సయ్యద్ గత కొన్ని రోజుల క్రితం మరణించడంతో బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ లక్ష రూపాయలు అందజేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు విప్ గంపగోవర్ధన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ శారదా నాగరాజు, జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్‌లు అంజలి, బూరని సమత స్వామి గౌడ్, మండల అధ్యక్షులు గంద్ర మధు సుధన్‌రావు, ఎంపీటీసీలు, నాయకులు శేఖర్, నర్సరెడ్డి, ఉపసర్పంచ్‌లు శ్రీకాంత్, నరేష్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.



అంచనూర్‌లో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్

వాలీబాల్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రెంజల్

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వాలీబాల్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్ నవీన్ కుమార్ తెలిపారు. ఆసక్తి గల యువత తమ పేర్లను 9912430664 నెంబర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

అలరించిన సంక్రాంతి సంబురాలు

- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ-బోధన్/రెంజల్

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో గల ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో పాఠశాల నిర్వాహకులు సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పండుగ శోభ ఉట్టిపడేలా గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసుని కీర్తనల సందడి, భోగిపళ్లు, భోగి మంటలు, పాలు పొంగించడం, పాడి, పంటల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల గొబ్బిళ్ల పాటల నృత్యాలతో పాఠశాలలో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. తనకు సంక్రాంతి ఇష్టమైన పండుగ అని ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలు పండగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలను ఇలా ప్రదర్శనతో వివరించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలలో సంక్రాంతి సంబరాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించడం చాలా బాగుందని తెలుపుతూ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల యాజమాన్యం అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, పాఠశాల అధినేత కొడాలి కిశోర్, ప్రిన్సిపాల్ సుధారాణి, హెచ్ఎం రామారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోగిమంటలు పెడుతున్న దృశ్యం

రెంజల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీలలో కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనడం అభినందనీయమని బోధన్ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా అన్నారు. సోమవారం మండలంలోని కందకుర్తి, రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడ లేవన్నారు. ఇప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని ఆమె పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సంస్కృతి సాంప్రదాయాలను ఉట్టిపడేలా వేసిన ముగ్గులను ఆమె పరిశీలించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శేషుగారి భూమారెడ్డి, సర్పంచులు ఎమ్మెస్ రమేష్ కుమార్, మీర్జా కలీంబేగ్, ఏకార్‌పాషా, పార్థవాని సాయిరెడ్డి, ఎంపీటీసీలు గంగలత భూమేష్, హజ్మల్ ఉన్నిసా, స్వప్న రామచందర్, నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్‌బేగ్, ఎంపీటీసీ అసాద్ బేగ్, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, ఏపీఎం చిన్నయ్య మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



హరిదాసు, గంగిరెద్దు వేషాధారణ చిన్నారులతో పలువురు

నందివాడలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని నందివాడ గ్రామంలో అయ్యప్ప స్వాములు అయ్యప్ప పడిపూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు పాటలు పాడుతూ పూజ నిర్వహించారు. అనంతరం పడి పూజకు విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

నేషనల్ యూత్ డే సందర్భంగా ఆట పోటీలు

నవతెలంగాణ-రాజంపేట్

మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే సందర్భంగా యువకులకు ముందస్తు కబడ్డీ వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలను ప్రారంభిస్తున్నట్టు ఎస్ఐ రాజు సోమవారం పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన మండలంలోని అన్ని గ్రామాల యువకులకు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలు నిర్వహిస్తామని ఇందులో విజేతలుగా నిలిచిన వారికి భిక్కనూర్ సర్కిల్ పరిధిలోని విజేత జట్టులతో పోటీలు నిర్వహిస్తామని, అందులో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జట్టును జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 4
మంగళవారం 10 జనవరి 2023

పేద విద్యార్థికి సురేందర్‌రెడ్డి చేయూత



నవతెలంగాణ-వర్ని
మండలంలోని అంతాపూర్ గ్రామానికి చెందిన గుగులోత్ కృష్ణ కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో పాస్ అయ్యాడు. ఫైనల్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కావడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో సర్పంచ్ పద్మ జగ్‌రామ్ ద్వారా బాన్సువాడ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ యువ నేత పోచారం సురేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన స్పందించి వెంటనే ట్యూషన్, హాస్టల్ ఫీజు కోసం రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో విద్యార్థి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

పాతడిజైన్ ప్రకారమే ప్రాజెక్టు నిర్మించాలి

- గ్రామసభలో తీర్మానం



నవతెలంగాణ-మోపాల్
మంచిప్పలో ప్రాజెక్టు పాత డిజైన్ ప్రకారమే నిర్మించాలని తీర్మానం చేశారు. మండలంలోని మంచిప్ప గ్రామంలో సర్పంచ్ సిద్ధార్థ అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. మండలంలోనే తమ గ్రామం ఆదర్శంగా నిలవాలని, దీనికి యువకుల పాత్ర చాలా కీలకమని ఆయన అన్నారు. గ్రామస్తులందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో నడిపిస్తానని తెలిపారు. భాగంగా డ్రైనేజీలకు, అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం తీర్మానం చేశారు. గ్రామసభలో వార్డు మెంబర్లు, వీడిసి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప్పల కాంతారెడ్డి
మృతికి సంతాపం

నవతెలంగాణ-కంఠేశ్వర్
కామ్రేడ్ ఉప్పల కాంతారెడ్డి మృతికి నిజామాబాద్ సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, మాజీ జిల్లా కార్యదర్శులు గంగాధరప్ప, పెద్ది వెంకట్రాములు, నాయకులు వేముల ఆనంద్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. కాంత రెడ్డి కోదాడ డివిజన్ మాజీ కార్యదర్శిగా ఎంతో మంది యువతను కమ్యూనిస్టుగా తీర్చిదిద్దిన మహా నాయకుడని అన్నారు. తనకు, తమ గ్రామ పార్టీకి మార్గదర్శకులు అని తెలిపారు.. బూర్జువా పార్టీల దాడులు కుట్రలని ఎదుర్కోవడంలో కాంత రెడ్డి దిట్టని, పార్టీ కార్యకర్తలను తన సొంత బిడ్డ ల్లాగా చూసుకునే మనస్తత్వం కలవారని, మునగాల రైతాంగానికి లిఫ్ట్ ఇరిగేషన్ సాధించిన రైతు పక్షపాతి అని అన్నారు.
ఉద్యమాల్లో నర్సింహులగూడెం పార్టీకి తోడుగా ఉంటూ ముందుకు నడపడానికి అనేక సహాయ సహకారాలు అందించిన నేత అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనే సరైన నివాళి అని జోహార్లు అర్పించారు. ఆయన మార్గంలో ఆశయ సాధనకై చివరి వరకు పోరాడుతానని అన్నారు.

ప్రశాంతంగా
యూజీ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఉదయం జరిగిన యూజీ రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలో 1,571 మంది విద్యార్థులకుగాను 1,425 మంది హాజరయ్యారని, 143 మంది గైర్ హాజరు అయ్యారని తెలంగాణ యూని వర్సిటీ పరిక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ సోమవారం తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 5వ,6వ సెమిస్టరు పరీక్షల్లో 10,264 కి గాను 9,053 మంది హాజరయ్యారని 731 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఆర్మూర్ లోని నరేంద్ర, సిద్దార్థ, విజేత పరీక్ష కేంద్రాలను నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తనిఖీ చేశారు.నిజామాబాద్ లోని ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కళాశాల లోని పరిక్ష కేంద్రంలో లో 5వ సెమిస్టరు పరీ క్షలో తెలుగు సబ్జెక్ట్ లో ఒకరు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు.
యూనివర్సిటి మెయిన్ క్యాంపస్ లో ఉదయం జరిగిన పీజీ మొదటి సెమిస్టరు (బ్యాక్ లాగ్) పరీక్షలో 120 మంది అభ్యర్థులు కు గాను 94 మంది పరీ క్షలు రాసారని, 31 మంది గైర్హాజరయ్యారని, పీజీ 3వ సెమిస్టరు బ్యాక్ లాగ్ మధ్యాహ్న పరీక్షలో 101 మంది అభ్యర్థులకు గాను 92 మంది పరీక్ష రాసారని 9 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు.

దోభిఘాట్ స్థలం మాకు ఇప్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రజకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
మోపాల్ మండలం సిర్పూర్ గ్రామంలో రజకులకు సంబంధించిన ధోబి ఘాట్ స్థలం అన్యాక్రాంతానికి గురైందని, తమ న్యాయం చేయాలని జిల్లా రజక ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు గుపన్ పల్లి శంకర్ కోరారు. సోమవారం సిర్పూర్ రజకులు తమభూమి తమకు ఇప్పించాల ని కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. 2007లో సిర్పూర్ గ్రామ శివారులో రజకులకు రెండు ఎకరాల స్థలాన్ని దోబీగాట్లకు కేటాయించారని తెలిపారు. దీన్ని గ్రామాభివద్ధి కమిటి ఇతరులకు కేటాయించిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టి ఆదుకో వాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సిరిపూర్ రజక కమిటీ అధ్యక్షులు సంజీవ్, ఉపాధ్యాక్షుడు భూమయ్య, ప్రసాద్ , పోశెట్టి, గణేష్ రజకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మనోవేదనతో గుండెపోటుకు గురై వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని మాణిక్ బండారుకు చెందిన ధర్పల్లి పోశెట్టి (41) మనోవేదనకు గురై గుండెపోటు వచ్చి మతిచెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం తెలిపారు. పోశెట్టి అన్న గోపాల్ పొలం విషయంలో మానసికంగా పోశెట్టిని ఇబ్బందికి గురి చేయడం వల్ల మనోవేదనకు గురై గుండెపోటుతో పోశెట్టి మతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మతుడికి భార్య పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోశెట్టి బిజెపి కార్యకర్త కావడంతో బిజెపి ఆర్మూర్ నియోజక వర్గ నాయకులు పొద్దుటూరి వినయ్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పడెను మోశారు. బీజేపీ నాయకులు సైతం పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానించిన టీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్
బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామానికి చెందిన సిర్ప సాయి సంకీర్తన్ ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీకి వెళ్తుండడంతో సోమవారం ఆ విద్యార్థిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, బీఆర్ఎస్ మండల కార్యదర్శి సుదర్శన్, డీసీసీబీ డైరెక్టర్స్ గిర్దవర్ గంగారెడ్డి, గింజుపల్లి శరత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు దేశాయ్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బుద్దే రాజేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు సాలురా షకీల్, బోధన్ మండల పార్టీ అధ్యక్షులు గోగినేని నరేంద్ర బాబు, బోధన్ యూత్ మండల అధ్యక్షులు గణేష్ పటేల్, యూత్ మండల ఉపాధ్యక్షులు నమిళ్ల చిన్న సాయన్న, నీరడి బాబురావు పాల్గొన్నారు.

రెండోవిడత 'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-పిట్లం
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 18 నుంచి చేపట్టనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కవిత విజయ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమంలో ఎంతోమందికి కంటి చూపు మెరుగుపడిందని, చూపు మందగించిన వారికి అద్దాలను సైతం ఉచితంగా పంపిణీ చేశారన్నారు. ప్రస్తుతం నిర్వహించే రెండవ విడతగానూ ప్రతి పంచాయతీ పరిధిలో నిర్వహించే శిబిరాలలో దృష్టిలోపం, కంటి సమస్యలున్నవారికి లబ్ది చేకూరేలా పంచాయతీ సెక్రటరీలు కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లచ్చిరెడ్డి, డీఎల్‌పీఓ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీఓ బ్రహ్మం, డాక్టర్ శివకుమార్, పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సమస్యలపై రేవంత్‌రెడ్డికి వినతి



నవతెలంగాణ-రామారెడ్డి
సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పోసానిపేట సర్పంచ్ గిరెడ్డి మహేందర్‌రెడ్డి హైదరాబాదులో పీసీసీ అధ్యక్షులు, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచుల నిధులు, విధులు, రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిపై రాష్ట్ర సర్పంచుల ఫోరం తరపున వినతిపత్రం అందించామని తెలిపారు.

హుస్సేన్‌నగర్‌లో బూత్‌కమిటీ ఏర్పాటు



ఎన్నికైన వారికి నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-సిరికొండ
మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ శాసనసభ సభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ ఏర్పాటు చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిరికొండ, జడ్పిటిసి మాన్సింగ్ నాయక్, సిరికొండ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్, హుస్సేన్ నగర్ సర్పంచ్ దానెం లక్ష్మీ తిరుపతి, ఉప సర్పంచ్ మోతే దేవేందర్, ఎంపీటీసీ దర్రాజ్ గోవర్ధన్, గ్రామశాఖ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తినేటి నర్సారెడ్డి, హుస్సేన్ నగర్ గ్రామ రైతు అధ్యక్షులు మోతే చిన్నారెడ్డి, సిరికొండ మండల జాగృతి కన్వీనర్ జయనంద్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దూమల గంగారెడ్డి, తినేటి బక్కన్న, గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని వీడి బీఆర్ఎస్‌లోకి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
బీజేపీ నియంతృత్వ పోకడలు నచ్చక, బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలు అభివృద్ధికి ఆకర్షితుడై నియోజకవర్గ అభివృద్ధి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తో మాత్రమే సాధ్యమని విశ్వసించి సోమవారం ఖిల్లా డిచ్‌పల్లి ఎంపీటీసీ భర్త లోక్కిడి సాయి, కార్తీక్, శ్రీకాంత్ బీఆర్ఎస్‌లో చేరారు. వారిని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దండుగుల సాయిలు, సీనియర్ నాయకులు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు శక్కరకొండ కృష్ణ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు విఠల్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం అధ్యాపకుల నియామకానికి 18న వ్రాత పరీక్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఎంఈడిలో పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకం కోసం నిర్వహించే రాత పరీక్ష ఈనెల 18న ఉదయం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్‌లో, మౌఖిక పరీక్ష 18 న మధ్యాహ్న మెయిన్ క్యాంపస్ గెస్ట్ హౌస్‌లో ఉంటుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్ లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



దగ్ధమైన ఇల్లును పరిశీలిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన ఆరే లక్ష్మీకి చెందిన నివాసపు ఇల్లు శనివారం షాట్‌సర్క్యూట్‌తో దగ్ధమై నిలువ నీడ లేకపోవడంతో ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఇంటి పైకప్పు రేకుల నిర్మాణం కోసం 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సునీల్ యువసేన సభ్యులు జింక అనిల్, భాను, పాలెపు నర్సయ్య పాల్గొన్నారు.

15 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్
జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. 30 మందికి సోమవారం నగరంలోని టిటిఐ సెంటర్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ చందర్ రాథోడ్

ఆరోగ్య ఉప కేంద్రానికి భూమిపూజ

- సబ్‌సెంటర్‌కు భూమిని విరాళంగా ఇచ్చిన దాత

నవతెలంగాణ-బోధన్
సాలూర మండలం హున్స గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి సర్పంచ్ చీల గంగామణి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందర్న, హున్స గ్రామాల ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే షకీల్ అమీర్ హెల్త్ సబ్ సెంటర్ మంజూరిచేసి దాని నిర్మాణానికి 20 లక్షల రుపాయలు మంజూరు చేశారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కాకుండా బాలింతలకు కేసీఆర్ కిట్ అందిస్తుందని, అలాగే గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తూ ఆదుకుంటుందని అన్నారు. ఈ సబ్ సెంటర్‌ను త్వరలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు.



ఆరోగ్య ఉపకేంద్రానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

సబ్‌సెంటర్‌కు భూమి విరాళం అందించిన దాత..
హున్స గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్ సెంటర్ కోసం గ్రామానికి చెందిన టీఆర్ఎస్ మండల నాయకులు జక్క సంజీవ్ పటేల్ తన తండ్రి జక్క మల్లికార్జునరావు పటేల్ జ్ఞాపకార్థం రెండుగుంటల భూమిని విరాళంగా అందించారు. ప్రజల సౌకర్యార్థం సబ్ సెంటర్ నిర్మాణానికి తన వంతు బాధ్యతగా భూమిని విరాళంగా అందించినట్టు జక్క సంజు పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మందర్న సర్పంచ్ గంగాధర్, హున్స గ్రామపెద్దలు చీల గంగారం, వినోద్, శ్రీనివాస్, ఎంపీటీసీ శివకుమార్, మాధవరావు పటేల్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్‌తో మంచి ఆదాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/మోర్తాడ్
మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భీంగల్ ఏడిఏ మల్లయ్య మాట్లాడుతూ... కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయిల్ పామ్ పంట సాగుపై మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయిల్‌ఫామ్ పంట సాగుతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని, ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ పంట సాగుకు రాయితీని కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మండల రైతు బంధు కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్ , కోన సముందర్ సింగిల్ విండో చైర్మన్ సామ బాపురెడ్డి , బషీరాబాద్ ఎంపీటీసీ జ్యోతి, నర్సాపూర్ సర్పంచ్ ప్రభాకర్, మండల వ్యవసాయ అధికారి బద్దం లావణ్య, మండల హార్టికల్చర్ అధికారి సుమన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పద్మ, రమేశ్, నిఖిల్, ఆయిల్ పామ్ ప్రియునిక్ కంపెనీ ప్రతినిధి జీవన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ



మోర్తాడ్‌లో..

ఆసక్తిగల రైతులు దరఖాస్తు తీసుకోవాలి..
మోర్తాడ్ : మండలంలోని గ్రామాల రైతులు ఆయిల్ ఫామ్ సాగు కోసం ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ఏడిఏ మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ, డ్రిప్పు మొక్కలు ఇవ్వడం పంట సాగు లాభాల గురించి వివరించారు. ఆసక్తిగల రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ బ్యాంక్ పాస్ బుక్, పట్టా పాస్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో దరఖాస్తు ఫారాన్ని సంబంధిత అధికారికి అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పిటిసి రవి, ఏవో లావణ్యచ సీడ్ సర్టిఫికెట్ డైరెక్టర్ సంజీవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు రైతు బందు కోఆర్డినేటర్లు ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ సినిమా ద్వారా
నైతిక విలువలు పెంపొందించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్
విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగిస్తున్న నేపథ్యంలో స్కూల్ సినిమా ద్వారా అనేక నైతిక విలువలు, మంచి ఉద్దేశాలు పెంపొందించాలని విశ్వవికాస్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత వినూత్న పద్ధతిలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం నిజామాబాద్ నగరంలోని విశ్వా వికాస్ పాఠశాలలో స్కూల్ సినిమా అనే ఒక విన్నూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ సుస్మిత మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్ది విద్యార్థుల్లో సంప్రదాయ పద్ధతిలో నేర్చుకొనే విధానం నుంచి డిజిటల్ ఆడియో విజువల్‌గా నేర్చుకోవడాని ఆకర్షితులవుతున్నారని అన్నారు. వారిలో ఆసక్తి కనబరించేందుకు అనేక సాంకేతిక వసతులతో కూడిన విద్యను తమ పాఠశాలలో అందిస్తున్నామని తెలిపారు. కానీ నేటి సమాజంలో ముఖ్యంగా విద్యార్థులు అవరుచుకోవాల్సిన విలువలను, ఇతర కార్యక్రమాలలో నిమగ్నమై చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. సినిమా అనేది సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని కూడా గ్రహించి "స్కూల్ సినిమా" ద్వారా అనేక నైతిక విలువలు, మంచి ఉద్దేశాలు పెంపొందించాలని ఆశిస్తూ ఎల్ఎక్స్ఎల్ ఐడియాస్ అనే కంపెనీతో అనుసంధానమై దీనిని ప్రారంభించామని ఆమె పేర్కొన్నారు.



స్కూల్ సినిమాలో పాల్గొన్న విద్యార్థులు

'ప్రజల వద్దకు ఆర్టీసీ'ని విజయవంతం చేయాలి

- బాన్సువాడ డిపో మేనేజర్ సదాశివ్
- చిల్లెర్గిలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమం

నవతెలంగాణ-పిట్లం
ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాన్సువాడ డిపో మేనేజర్ సదాశివ్ అన్నారు. సోమవారం మండలంలోని చిల్లేర్గి గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీని ఆదరించి సంస్థ బాగోగుల దృష్ట్యా కాపాడాలని, ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సురక్షితముగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిని రమేష్, ఉప సర్పంచ్ ముల్తాని ఆర్టీసీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు